క్లుప్తంగా

బోయినపల్లి ఎస్సైగా శ్రీకాంత్


బాధ్యతలు స్వీకరిస్తున్న ఎస్సై

బోయినపల్లి: బోయినపల్లి ఎస్సైగా ఎల్. శ్రీకాంత్ బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ ఎస్సైగా పనిచేసిన మహేందర్‌ను ఏఆర్‌కు అటాచ్‌చేస్తూ ఎస్పీ అఖిల్ మహాజన్ బదిలీ చేశారు. ఎస్సై శ్రీకాంత్ మాట్లాడుతూ.. మండల ప్రజలకు అందుబాటులో ఉంటానని, శాంతిభద్రతలకు సహకరించాలని కోరారు. అంతకుముందు ఎస్పీ అఖిల్ మహాజన్‌ను ఆయన మర్యాదపూర్వకంగా కలిశారు.

వాహనాల తనిఖీ


వాహనాలు తనిఖీ చేస్తున్న పోలీసులు

కోనరావుపేట: మండలంలోని కొలనూర్‌లో ఎస్సై ఆంజనేయులు ఆధ్వర్యంలో వాహనాల తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ వాహనదారులు వాహన ధ్రువపత్రాలు కలిగి ఉండాలని, హెల్మెట్ ధరించాలని సూచించారు. ఎస్సై వెంట సిబ్బంది ఉన్నారు.

19న చెకుముకి టాలెంట్ టెస్ట్

బోయినపల్లి(చొప్పదండి): చెకుముకి సైన్స్ సంబరాల్లో భాగంగా ఈనెల 19న పాఠశాల స్థాయి, 27న మండలస్థాయి ఫిబ్రవరి 3న జిల్లా స్థాయి, అనంతరం రాష్ట్రస్థాయి చెకుముకి టాలెంట్ టెస్టులు నిర్వహించనున్నట్లు జనవిజ్ఞాన వేదిక జిల్లా ప్రధాన కార్యదర్శి సంపతి రమేశ్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో చదువుతున్న 8,9,10వ తరగతి విద్యార్థులు పరీక్షకు అర్హులన్నారు. ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు రూ.5, ప్రైవేట్ స్కూల్ విద్యార్థులకు రూ.10 నామమాత్రపుఫీజు ఉంటుందన్నారు. మరిన్న వివరాలకు 9959556367, 7989579428, 9493111341 నంబర్లలో సంప్రదించాలన్నారు.

సెస్ వినియోగదారుల ఆందోళన



వీర్నపల్లి: విద్యుత్ బిల్లులు అధికంగా వచ్చాయంటూ మండలంలోని వన్‌పల్లి గ్రామంలో సెస్ వినియోగదారులు మంగళవారం ఆందోళనకు దిగారు. కరెంట్ బిల్ కలెక్టర్ గ్రామానికి రావడంతో పెద్దసంఖ్యలో వినియోగదారులు చేరుకొని సెస్ సిబ్బందితో గొడవకు దిగారు. బిల్లులు అధికంగా ఎందుకు వచ్చాయంటూ నిలదీశారు. ఇందుకు అధికారులు బాధ్యత వహించాలన్నారు. ఓ వినియోగదారుడు మీటర్ నేలకేసి కొట్టగా గొడవ మరింత ముదిరింది. ఇప్పటికైనా సెస్ అధికారులు సమస్యను పరిష్కరించాలని గ్రామస్తులు కోరుతున్నారు.

కార్యవర్గం ఎన్నిక

ముస్తాబాద్: మండల పాస్టర్ల సంఘం ఎన్నికను నిర్వహించారు. అధ్యక్షుడిగా టి. దేవానందం, ఉపాధ్యక్షుడిగా డేవిడ్, ప్రధాన కార్యదర్శిగా గొద్యోను, సంయుక్త కార్యదర్శిగా పద్మారావు, కోశాధికారిగా సామ్యూల్, కార్యవర్గ సభ్యులుగా స్టీవెన్‌పాల్, గిద్యోను ఎన్నికయ్యారు.

ఫ్లెక్సీల చించివేతపై విచారణ



బోయినపల్లి: మండలంలోని విలాసాగర్‌లో కాంగ్రెస్ నాయకులు ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలను చించివేయడం కలకలం సృష్టించింది. సంక్రాంతి సందర్భంగా స్థానిక కాంగ్రెస్ నాయకులు ఫ్లెక్సీలు ఏర్పాటు చేశారు. కొందరు గుర్తు తెలియని వ్యక్తులు వాటిని చించివేశారు. దీనిపై స్థానిక నాయకులు పోలీసులకు ఫిర్యాదు చేయగా వేములవాడ రూరల్ సీఐ కృష్ణకుమార్ సోమవారం గ్రామంలో విచారణ చేపట్టారు.

రామమందిర నిర్మాణంపై విమర్శలు సరికాదు

గంభీరావుపేట : అయోధ్య రామమందిర ప్రాణప్రతిష్ట మహోత్సవ కార్యక్రమంపై కాంగ్రెస్ పార్టీ విమర్శలు సరికాదని బీజేపీ కిసాన్ మోర్చా మండల అధ్యక్షుడు కోడె రమేశ్ అన్నారు. హిందూమతాన్ని అవహేళన చేసినా, సంప్రదాయాలను అవమానపర్చినా ఊరుకునేది లేదన్నారు.

సంబురంగా సంక్రాంతి

జిల్లావ్యాప్తంగా సంక్రాంతి సంబురాలను సోమవారం సంబురంగా నిర్వహించారు. మహిళలు ఇళ్లముందు కల్లాపితో శుభ్రంచేసి రంగురంగుల ముగ్గులు వేసి, గొబ్బెమ్మలు పెట్టారు. రకరకాల పిండివంటలతో ఇళ్లన్నీ ఘుమఘుమలాడాయి. చిన్నారులకు భోగి పండ్లు పోసి ఆశీర్వదించారు. చిన్నారులు, యువకులు ఉత్సాహంగా పతంగులు ఎగురవేసి సందడి చేశారు. గంగిరెద్దుల విన్యాసాలు ఆకట్టుకున్నాయి. మంగళవారం కనుమ పండుగ నిర్వహించారు. పలు గ్రామాల్లో నాయకులు, ప్రజాప్రతినిధులు ముగ్గుల పోటీలు నిర్వహించి బహుమతులు అందించారు. కోనరావుపేట మండలం కనగర్తిలో కాట్రేవుల పండుగ నిర్వహించారు. సంక్రాంతి సందర్భంగా పలు ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు.

– సాక్షి నెట్‌వర్క్


తంగళ్లపల్లి: గండిలచ్చపేటలో ముగ్గులు వేస్తున్న మహిళలు


సిరిసిల్లలో ముగ్గులు వేస్తున్న మహిళలు


కోనరావుపేట : ముంబైలో సంక్రాంతి వేడుకల్లో పాల్గొన్న మహిళలు


బోయినపల్లి: బహుమతులు అందిస్తున్న తహసీల్దార్ పుష్పలత


ఎల్లారెడ్డిపేట: ముగ్గులు వేస్తున్న మహిళలు



సిరిసిల్లలో ఆకట్టుకున్న అయోధ్య సీతారాముడి ముగ్గు


ముస్తాబాద్‌లో విశేష అలంకరణలో అయ్యప్పస్వామి వారు


వీర్నపల్లి : వీర్నపల్లిలో ఆకట్టుకుంటున్న ముగ్గు


ఎల్లారెడ్డిపేట: నారాయణపూర్‌లో ముగ్గు వేస్తున్న చిన్నారులు


సిరిసిల్లలో పట్టణంలో..

'ఆది'కి ఆహ్వాన పత్రిక అందజేత


ఆహ్వాన పత్రిక అందిస్తున్న రాము

వేములవాడ అర్బన్: వైఎస్సార్ తెలంగాణ పార్టీ అధినేత్రి వైఎస్ షర్మిల కుమారుడి వివాహానికి రావాలని వేములవాడ ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్‌కు మంగళవారం ఆహ్వాన పత్రిక అందించింది. వైఎస్సార్ టీపీ జిల్లా అధ్యక్షుడు చొక్కల రాము పట్టణంలో ఎమ్మెల్యేను కలిసి ఆహ్వాన పత్రిక అందించారు.

నేడు పలు గ్రామాల్లో పర్యటన

కోనరావుపేట: మండలంలోని వట్టిమల్ల, కొలనూర్, ధర్మారం, మర్తనపేట గ్రామాల్లో బుధవారం ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ పర్యటించనున్నట్లు కాంగ్రెస్ మండలాధ్యక్షుడు షేక్ ఫిరోజ్‌పాషా తెలిపారు. వట్టిమల్లలో ప్రాథమిక ఆరోగ్య ఉపకేంద్ర భవనం ప్రారంభం, మర్తనపేటలో చాకలి ఐలమ్మ విగ్రహావిష్కరణ, కొలనూర్, ధర్మారం, మర్తనపేట గ్రామాల్లో కృతజ్ఞతా ర్యాలీలో పాల్గొంటారని పేర్కొన్నారు.

'లగిశెట్టి'పై సీఎంకు ఫిర్యాదు చేస్తా

సిరిసిల్లటౌన్: గత అసెంబ్లీ ఎన్నికల్లో స్వతంత్ర అభ్యర్థి లగిశెట్టి శ్రీనివాస్ వద్ద పీఆర్‌వోగా పనిచేయగా తనను మోసం చేశాడని ఆరోపిస్తూ ఆత్మహత్యయత్నానికి పాల్పడిన బాధితుడు మిట్టపల్లి శ్రీకాంత్ తెలిపారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ.. ఎన్నికల్లో తనతో పాటు స్నేహితులు లగిశెట్టి శ్రీనివాస్ వద్ద పనిచేయగా రూ.లక్ష ఇస్తామని చెప్పి మోసం చేశాడని, మనస్తాపంతో ఆత్మహత్యాయత్నానికి పాల్పడగా పోలీసులు రక్షించినట్లు తెలిపారు. టౌన్ సీఐకి ఫిర్యాదు చేయగా లగిశెట్టి శ్రీనివాస్ (ఏ1), గుంటుక శ్రీనివాస్ (ఏ2), ఏలూరి రవికిరణ్‌ను (ఏ3)లుగా పేర్కొంటూ కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు. ఆయనపై ప్రజాభవన్‌లో సీఎంకు, మానవ హక్కుల కమిషన్‌ను ఆశ్రయించనున్నట్లు చెప్పారు.

గెలుపోటములను సమానంగా స్వీకరించాలి

• సిరిసిల్ల ఎమ్మెల్యే కేటీఆర్


చందుర్తి : జ్యోతి ప్రజ్వలన చేస్తున్న కేటీఆర్

చందుర్తి(వేములవాడ): క్రీడల్లో, రాజకీయాల్లో గెలుపోటములను సమానంగా స్వీకరించాలని బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, సిరిసిల్ల ఎమ్మెల్యే కేటీఆర్ అన్నారు. మండలంలోని మల్యాల గ్రామంలో ఉమ్మడి జిల్లాస్థాయి వాలీబాల్ పోటీలను మంగళవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రీడలతో స్నేహభావం పెంపుతోపాటు మానసికోల్లాసం కలుగుతుందన్నారు. అనంతరం క్రీడాకారులను పరిచయం చేసుకున్నారు. కార్యక్రమంలో జెడ్పీ చైర్‌పర్సన్ న్యాలకొండ అరుణ, మాజీ ఎంపీ వినోద్‌కుమార్, బీఆర్‌ఎస్ వేములవాడ నియోజకవర్గ బాధ్యులు చల్మెడ లక్ష్మీనర్సింహరావు, సర్పంచ్ లక్ష్మీ నారాయణ, వైస్ ఎంపీపీ అబ్రహం, క్రీడా నిర్వాహకులు వీర్నపెల్లి రాజు, ఉమ్మడి క్రీడాకారులు పాల్గొన్నారు.

డబుల్ బెడ్రూం ఇళ్లు కేటాయించాలని వినతి

సిరిసిల్ల: సిరిసిల్లలో పెండింగ్‌లో ఉన్న డబుల్ బెడ్రూం ఇళ్లను పేదలకు కేటాయించేలా చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే కేటీఆర్‌కు సీపీఎం జిల్లా కార్యదర్శి మూషం రమేశ్ మంగళవారం వినతిపత్రం అందించారు. డబుల్ బెడ్రూం రాని 963 మంది అర్హులకు ఇంటిస్థలం కేటాయించి రూ.5లక్షలు మంజూరు చేయించాలని కోరారు. ఇప్పటికే ఇళ్లు కేటాయించిన 105 మందికి అందించాలన్నారు. సిరిసిల్లలో వస్త్ర పరిశ్రమను బంద్ చేస్తున్నారని, ఈ సంక్షోభాన్ని నివారించి కార్మికులకు ఉపాధి కల్పించాలని ఆయన కోరారు. సీపీఎం నాయకులు కోడం రమణ, మోర తిరుపతి, బాబు, దినేశ్ వినతిపత్రం అందించిన వారిలో ఉన్నారు.

'టెక్స్‌టైల్ పార్క్ బంద్‌తోనే కార్మికుడి ఆత్మహత్య'


మాట్లాడుతున్న మూషం రమేశ్

తంగళ్లపల్లి: టెక్స్‌టైల్ పార్కు యాజమాన్యం పరిశ్రమలను బంద్ చేయడంతోనే ఆర్థిక ఇబ్బందులతో కార్మికుడు ఆత్మహత్య చేసుకున్నాడని.. పవర్‌లూమ్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు మూషం రమేశ్ ఆరోపించారు. మంగళవారం సారంపల్లి–బద్దెనపల్లి టెక్స్‌టైల్ పార్కులో ఏర్పాటుచేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా చంద్రహాస్‌కు సంతాపం తెలిపారు. కార్మికుడి ఆత్మహత్యకు యజమానులే బాధ్యత వహించాలన్నారు. 15 రోజులపాటు పరిశ్రమలను బంద్‌చేసి ప్రభుత్వం ఆర్వీఎం వస్త్రం ఆర్డర్ ఇవ్వగానే కార్మికులను పనులకు రావాలని పిలిస్తున్నారని మండిపడ్డారు. ఇలాంటివి మళ్లీ పునరావృతం కాకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. సమావేశంలో నాయకులు శుభశేఖర్, నరేశ్, రవి, మోహన్, రమేశ్, నరేందర్, మహేశ్, సంపత్, శ్రీనివాస్, రాజు, పవర్‌లూమ్ కార్మికులు పాల్గొన్నారు.

కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

సిరిసిల్లటౌన్: పెండింగ్‌లో ఉన్న మధ్యాహ్న భోజన కార్మికుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి కడారి రాములు అన్నారు. ఫిబ్రవరి 4న సిరిసిల్లలో కార్మికుల సమస్యల సాధనకు ర్యాలీ, కార్మికులతో మహాసభ నిర్వహిస్తామన్నారు. కరపత్రాలను ఆయన ఆవిష్కరించి మాట్లాడారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వం కార్మికులను పట్టించుకోలేదని, కాంగ్రెస్ ప్రభుత్వం కార్మికుల న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలన్నారు. జిల్లావ్యాప్తంగా కార్మికులు పెద్దఎత్తున పాల్గొనాలన్నారు. మధ్యాహ్న భోజన కార్మికులు, నాయకులు పాల్గొన్నారు.

ఐకమత్యంగా సమస్యలు పరిష్కరించుకోవాలి


నగదు అందిస్తున్న సంఘం సభ్యులు

ఎల్లారెడ్డిపేట: రెడ్డిలు ఐకమత్యంగా తమ సమస్యల పరిష్కరించుకోవాలని మండల రెడ్డి సంఘం అధ్యక్షుడు గుండాడి వెంకట్‌రెడ్డి పిలుపునిచ్చారు. మండలంలోని నారాయణపూర్ రెడ్డి సంక్షేమ సంఘం తరఫున 70 సభ్యత్వాల రూపంలో సేకరించిన రూ.70 వేలను వెంకట్‌రెడ్డికి మంగళవారం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..మండల కేంద్రంలో రెడ్డిసంక్షేమ భవన నిర్మాణానికి అన్నిగ్రామాల్లో డబ్బులు సేకరిస్తున్నట్లు తెలిపారు. ప్రభుత్వం నిరుపేద రెడ్డిల సంక్షేమానికి ప్రత్యేక నిధులు కేటాయించాలన్నారు. సంఘం భవనానికి నిధులు మంజూరు చేయాలని కోరారు. రెడ్డి సంఘం అధ్యక్షుడు నిమ్మ మల్లారెడ్డి, సభ్యులు నర్సింహరెడ్డి, మోతె మధుసూదన్ రెడ్డి, పర్శరాం రెడ్డి, సుధాకర్ రెడ్డి, గోగూరి దేవిరెడ్డి పాల్గొన్నారు.

శబరిమలకు తరలిన అయ్యప్ప స్వాములు

ఎల్లారెడ్డిపేట: 41రోజులపాటు కఠోర దీక్ష చేసిన అయ్యప్ప మాలధారులు మండలకేంద్రం నుంచి మంగళవారం శబరిమలకు తరలివెళ్లారు. 25 మంది స్వాములు అయ్యప్ప ఆలయంలో ప్రత్యేక పూజలు చేసిన అనంతరం ముస్తాబాద్‌కు చెందిన గురుస్వామి రాజు, ల్యాస్‌పూర్ శ్రీను గురుస్వాముల కరకములతో ఇరుముడులతో శబరిమలకు బయలుదేరారు. గురుస్వామి రవి, నవీన్, అశోక్, శ్రీనివాస్, నంది నరేశ్, రంజిత్ తదితరులున్నారు.

విద్యుత్ మోటార్ల వైర్లు చోరీ


విద్యుత్ వైర్లను పరిశీలిస్తున్న నాయకులు, అధికారులు

ఎల్లారెడ్డిపేట: మండల కేంద్రంలోని మూడోవార్డులోని పోచమ్మ గుడి వద్ద గ్రామంలోని నీటి సరఫరాకు సంబంధించిన విద్యుత్ మోటార్ల స్టార్టర్ల వైర్లను దొంగలు సోమవారం రాత్రి ఎత్తుకెళ్లారు. వైర్ల దొంగతనంపై ఉపసర్పంచ్ ఒగ్గు రజిత, కార్యదర్శి దేవరాజు మంగళవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. గ్రామంలో నీటి సరఫరాకు వినియోగించే మోటార్ల వైర్లను ఎత్తుకెళ్లడంతో ఉదయం గ్రామంలో తాగునీటి సరఫరా నిలిచిపోయింది. సర్పంచ్ నేవూరి వెంకట్‌రెడ్డి, ఉపసర్పంచ్ ఒగ్గు రజిత చోరీకి గురైన మోటార్లను పరిశీలించారు. సెస్, ఇతర శాఖల అధికారులను అప్రమత్తం చేసి కొత్త విద్యుత్ వైర్లను తెప్పించి నీటి సరఫరా పునరుద్ధరణకు చర్యలు తీసుకున్నారు. విద్యుత్ వైర్ల చోరీపై పోలీసులు కేసు నమోదు చేసి, దొంగల కోసం గాలిస్తున్నారు.

పాఠశాలలో క్షుద్రపూజలు కలకలం

కోనరావుపేట: మండలంలోని ధర్మారం ప్రాథమిక పాఠశాలలో గుర్తు తెలియని వ్యక్తులు క్షుద్రపూజలు నిర్వహించినట్లు సమాచారం. ఎస్‌ఎంసీ చైర్మన్ నాగరాజు పాఠశాలలోని బాత్‌రూంలకు పైప్‌లైన్ బిగించేందుకు మంగళవారం వెళ్లాడు. వంటగదిలో పసుపు, నిమ్మకాయలు, కోడిగుడ్లు ఇతర వస్తువులు కనిపించాయి. పాఠశాలలో క్షుద్రపూజలు నిర్వహించారా.. లేదా భయపెట్టేందుకు ఇలా చేశారా అన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

ఆలయ కమిటీ ఎన్నిక


జితేందర్‌రావు

ముస్తాబాద్: మండలకేంద్రంలోని శ్రీ హరిహరపుత్ర అయ్యప్ప స్వామి ఆలయ అభివృద్ధి కమిటీ చైర్మన్‌గా గూడూరుకు చెందిన చీటి జితేందర్‌రావు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. రాజు గురుస్వామి ఆధ్వర్యంలో మంగళవారం సమావేశం జరగగా జితేందర్‌రావును రెండోసారి చైర్మన్‌గా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఆలయ అభివృద్ధికి తనవంతు సహకారం అందిస్తానని జితేందర్‌రావు పేర్కొన్నారు.

ఆర్థికసాయం అందజేత

ముస్తాబాద్: మండలంలోని పోతుగల్ చెందిన కొదాటి దేవరాజు ఇటీవల అనారోగ్యంతో మృతిచెందాడు. 1997–98 ఎస్సెస్సీ బ్యాచ్‌కు చెందిన స్నేహితులు బాధిత కుటుంబానికి మంగళవారం ఆర్థికసాయం అందజేశారు. రూ.27వేలు జమచేసి మృతుడి కూతురి పేరిట ఫిక్స్‌డ్ డిపాజిట్ చేసి బాండ్ అందజేశారు. బంజార సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు గురుబాబునాయక్ రూ.5వేలు అందించారు.

వికసిత్ భారత్ సంకల్ప యాత్ర

బోయినపల్లి: మండలంలోని మల్కాపూర్‌లో మంగళవారం వికసిత్ భారత్ సంకల్ప్ యాత్ర నిర్వహించారు. కేంద్ర ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. అనంతరం క్యాలెండర్ ఆవిష్కంచారు. ఎంపీడీవో నల్లా రాజేందర్ రెడ్డి, ఎంపీవో గంగాతిలక్, సర్పంచ్ కోరెపు నరేశ్, బీజేపీ మండల అధ్యక్షుడు గుడి రవీందర్ రెడ్డి, నర్సింహచారి, పరశురాం ఎడపల్లి, ఈజీఎస్, ఐసీడీఎస్ సిబ్బంది పాల్గొన్నారు.

క్రీడాకారులకు బహుమతులు ప్రదానం


కోనరావుపేట: కనగర్తిలో వాలీబాల్ ఆడుతున్న యువకులు


వేములవాడరూరల్: : గెలుపొందిన జట్టుతో ప్రజాప్రతినిధులు


తంగళ్లపల్లి: క్రీడాకారులతో ఎంపీపీ, నాయకులు

కోనరావుపేట: సంక్రాంతి సందర్భంగా మండలంలోని కనగర్తిలో కరీంనగర్ డెయిరీ ఆధ్వర్యంలో యువకులకు వాలీబాల్ పోటీలు నిర్వహించారు. పోటీల్లో 11 జట్లు పాల్గొనగా జైభీమ్ టీం (ప్రథమ), దోస్తానా యూత్ (ద్వితీయ) స్థానాలు సాధించారు. విజేతలకు డెయిరీ అధ్యక్షుడు జిల్లెల్ల లక్ష్మారెడ్డి, ఉపసర్పంచ్ వంగపెల్లి దేవరాజు, డైరెక్టర్లు బహుమతులు అందజేశారు. ధర్మారంలో ఎస్‌ఎంసీ చైర్మన్ పొన్నం తిరుపతి గౌడ్ తల్లి శంకరవ్వ జ్ఞాపకార్థం క్రికెట్ పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందించారు.

వేములవాడరూరల్: వేములవాడ మున్సిపల్ పరిధిలోని 3వ వార్డు అయ్యోరుపల్లిలో ఉల్లెందుల వెంకటి స్మారకార్థం క్రికెట్ టోర్నమెంట్ నిర్వహించారు. ఈ పోటీల్లో 3 టీములు పాల్గొనగా నగేశ్ టీమ్ మొదటి స్థానంలో నిలవగా, రెండోస్థానంలో ఉల్లెందుల తిరుపతి జట్టు గెలుపొందింది. మొదటి బహుమతి ట్రోఫీతో పాటు రూ.3 వేలు, రెండో బహుమతి ట్రోఫీతో పాటు రూ.2వేల అందజేశారు. మాజీ సర్పంచులు అంజయ్య, వంగల రాజమల్లు, మల్లేశం, హన్మయ్య, పోచయ్య, లింగంపెల్లి రాజు, వంగల తిరుపతి, తదితరులు పాల్గొన్నారు.

జిల్లెల్లలో..

తంగళ్లపల్లి (సిరిసిల్ల): తంగళ్లపల్లి మండలం జిల్లెల్లలో జిల్లాస్థాయి వాలీబాల్ పోటీలు నిర్వహించారు. ఇల్లంతకుంట మండలం రేపాక గ్రామ వాలీబాల్ టీమ్ సత్తాచాటి జిల్లాస్థాయిలో ప్రథమ స్థానం సాధించారు. మంగళవారం రూ.10 నగదుతోపాటు మెమోంటో అందజేశారు.

ముగిసిన క్రికెట్ టోర్నీ

తంగళ్లపల్లి: సంక్రాంతి పండగ సందర్భంగా మండల కేంద్రంలో నిర్వహించిన క్రికెట్ టోర్నీ సోమవారం ముగిసింది. క్రీడాకారులకు ఎంపీపీ పడిగెల మానస ట్రోఫీలను అందజేశారు. టోర్నీ నిర్వాహకుడు ఎంపీటీసీ కోడి అంతయ్య, సింగిల్‌విండో వైస్ చైర్మన్ ఎగుమామిడి వెంకట రమణ రెడ్డి, సాంస్కృతిక కళాకారులు క్రీడాకారులు పాల్గొన్నారు.

గంభీరావుపేట: మండలంలోని గజసింగవరంలో గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో క్రీడాపోటీలు నిర్వహించారు. వాలీబాల్, కబడ్డీ పోటీలు నిర్వహించగా సర్పంచ్ సుతారి బాలరాజు చేతుల మీదుగా విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు.

వీర్నపల్లి : మండలకేంద్రంలో డీవైఎఫ్ఐ ఆధ్వర్యంలో నిర్వహించిన మండలస్థాయి క్రికెట్ పోటీలు సోమవారం ముగిశాయి. 14 జట్లు పోటీల్లో పాల్గొనగా వీర్నపల్లి జట్టు ప్రథమ, ఎర్రగడ్డ జట్టు ద్వితీయ బహుమతులు గెలుచుకోగా ప్రజాప్రతినిధులు బహుమతులు అందజేశారు.

పూర్వ విద్యార్థుల సమ్మేళనం


సమావేశమైన పూర్వ విద్యార్థులు

బోయినపల్లి(చొప్పదండి): మండలకేంద్రంలోని హైస్కూల్‌లో చదివిన 1998–99 పదో తరగతి బ్యాచ్ విద్యార్థుల పూర్వ విద్యార్థుల సమ్మేళనం మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యాబుద్ధులు నేర్పిన అప్పటి ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించారు. ఆటపాటలతో రోజంతా ఆనందంగా గడిపారు.

పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలి

ఎల్లారెడ్డిపేట: ప్రతిఒక్కరూ పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రాం అధికారి వాసరవేని పర్శరాములు, సర్పంచ్ ముక్క శంకర్ అన్నారు. మండలంలోని రాజన్నపేటలో నిర్వహిస్తున్న ఎన్‌ఎస్‌ఎస్ శీతకాల శిబిరంలో భాగంగా నాలుగోరోజు గ్రామంలోని వీధులను శుభ్రంచేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. శ్రమదానం, సేవా కార్యక్రమాలతో గ్రామవీధులన్నీ శుభ్రంగా మారాయన్నారు. కార్యక్రమంలో అధ్యాపకులు విష్ణుప్రసాద్, సాగర్, వలంటీర్లు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

తంగళ్లపల్లి(సిరిసిల్ల): ఇల్లంతకుంట మండలం అనంతగిరి 33కేవీ సబ్‌స్టేషన్‌లో మరమ్మతుల కారణంగా బుధవారం ఉదయం 9 నుంచి సాయంత్రం 4 గంటల వరకు సరఫరాలో అంతరాయం ఉంటుందని సెస్ ఏఈ ఒకప్రకటనలో తెలిపారు. వినియోగదారులు సహకరించాలన్నారు.